# పెద్దోడి షోకు

'రాష్ట్రంలో ఉన్న బంట్రోతుల సంఖ్య తగ్గించవచ్చు.' పేపర్లో వార్త చదువుతున్నాడు ఇంజనీరుగారి చిన్నబ్బాయి.

అస్పష్టంగా విన్న అప్పలస్వామి కడుగుతూన్న కాఫీ కప్పులు బకెట్‌లో వదిలి "ఏమిటి బాబుగారూ! మళ్ళీ చదవండి" అన్నాడు అతని దగ్గరకు వెళ్ళి నిల్చుని చేతులుపై మీద తుండు గుడ్డతో తుడుచుకుంటూ.

పేపర్లో ప్రచురితమైన విషయమంతా చదవలేదు ఇంజనీరుగారి అబ్బాయి. 'ఆఫీసర్లు, అదనపు పనులు చేయించుకునే నిమిత్తం డెబ్భైఐదు రూపాయలు తీసుకుంటూ, మళ్ళీ బంట్రోతుల్ని ఉపయోగించుకుంటున్నారు ఇంటి పనులకి.' అనే వార్త అప్పలస్వామి ఎదుట చదవటం ఇష్టంకాక.

అప్పలస్వామి ఉదయం ఐదుగంటలయ్యేసరికి వస్తాడింటికి,

వేడినీళ్ళు కాచి, కాఫీనీళ్ళు పెడతాడు. ఒక్కో అప్పుడు అమ్మగారు లేవటం ఆలశ్యమైతే కాఫీ కలిపి ఫ్లాస్కులో పోసి, పని మనిషికి గిన్నెలు వేసి, పిల్లలులేస్తే నీళ్ళుపోసి, వాళ్ళని సైకిలు మీద స్కూలుకి దిగబెట్టి... ఒకటేమిటి? మధ్యాహ్నం ఒంటి గంటదాకా నిల్చోకుండా కూర్చోకుండాఏదో పనే. ఈ మధ్య కొన్న పాలతో కాఫీ బాగుండటంలేదని గేదెనే కొనిపించింది అమ్మగారు. దానిసేవ కూడాఅప్పలస్వామిదే. మరోబంట్రోతు వంట చేస్తాడు. ఇంకొకడు బట్టలు సర్ఫ్‌లో పిండి ఆరవేస్తాడు

గవర్నమెంటు ఇచ్చేడెభై ఐదు రూపాయలూ మింగేసి. ముగ్గురు బంట్రోతుల్ని ఇంటిపనుల క్రింద వుంచుకునే ఇంజనీరు తెగువ గుండెధైర్యం చూస్తూంటే వళ్ళు మండిపోతూంటుంది అప్పలస్వామికి, అప్పలస్వామి గ్రహించిన ఈ సత్యం. గవర్నమెంటు చాలా ఆలశ్యంగా తెలుసుకుంది. అయితే, 'బంట్రోతుల్ని తగ్గించాలి' అన్నవార్త వినేసరికి అతనికి గుండె గతుక్కుమంది.

ఈ ఉద్యోగం సంపాయించుకోడానికి ఎందరి వెనుకతిరిగి దేవురించాడు! తానే కాదు. ప్రతివాడు అంతే. కొంతకాలం. ఉద్యోగం వేయించిన ఆస్వామి జీతంలో నెలనెలా పది రూపాయలు తీసుకునేవాడు. ఖరీదైన బట్టల్లో మిడిసిపడుతూ జీప్‌లో షికార్లుకొట్టే ఆఫీసరును---ఆబట్టల చాటున వున్న అసలు మనిషి—తన కష్టం తినే మనిషిని చూస్తే తనకి ఏవగింపుగా, ఉండేది. ఉద్యోగపు హోదాలో మనిషి ఎంత పెద్ద వాడో అతని మనసు అంత చిన్నది.

అతను కాలికి తొడిగిన బూటు తుడుస్తూఅనుకునేవాడు అప్పలస్వామి. 'పదిహూపాయలకి తన ముందుకు చెయ్యిచాచే వీడిచెప్పులునేనెందుకు తుడవాలి!' ఆ పని చెయ్యటానికి మనస్సు మొరాయించేది. కాని తప్పదు. తనకు గవర్నమెంటు చెయ్యమన్న ఉద్యోగం వేరు. తనచేత వీళ్ళు చేయించే ఉద్యోగంఇదే. అతను, అతనిభార్యాపిల్లలూ, అతనింటికివచ్చినబంధువులూ... అందరు పురమాయించే పనులూ చెయ్యాలి...దీని సిగ దరగా...ఏటి చెయ్యాలి ఈళ్ళని. ఎలా బుద్ధి చెప్పాలి. కసిగా గట్టిగా తుడిచేవాడు బూటుని. గతంలోకి దిగజారిన అప్పలస్వామిని "ఏమిటలా నించుండిపోయావ్? లోపలికి పోయి పని చూసుకో" తృళ్ళిపడేట్టు కసిరాడు ఇంజనీరుగారి చిన్నబ్బాయి.

"ఆ పేపరు ఓసారి ఇలా ఇస్తారేటి బాబూ! సూసి ఇచ్చేస్తాను" వినయంగా అడిగాడు అప్పలస్వామి. అతనికి తెలుగు చదవడం వచ్చు.

"ఆ. వెళ్ళు, వెళ్ళు. నీకేం ప్రమోషను ప్రకటించ లేదులే" అన్నాడతను.

వెనుదిరిగి లోపలికి నడిచాడేగాని పేపరులోని వార్త మీదే వుంది అతని ఆలోచనంతా.

"ఏమిరా అప్పలస్వామీ! పాలు తక్కువ తీశావ్!" అడిగింది అమ్మాగారు. 'రెండు శేర్ల పాలు పితకాల్సింది శేరు న్నరే పితికి. 'నీ నోటికినేనెందుకు అడ్డం రావాలి తాగెయ్. అని నోదమకి వదిలేశాడవ్వాళ అప్పలస్వామి.

ఆమె అందరు బంట్రోతుల్ని 'ఏరా!' అనే పిలుస్తుంది. చిర్రెత్తుకొస్తుంది అప్పలస్వామికి. 'ఏమోయ్' అంటే ఈమె సొమ్మేం పోతుందని. అయినా అణచుకుంటాడు తనను తాను.

"అంతే ఇచ్చిందండి" అనేశాడు.

అతని మనసు మనసులో లేదు. పేపరులోని వార్తేమిటో చదవాలి. మధ్యాహ్నం తాను ఒంటిగంటకు ఇంటికి భోజనానికి వెళ్లేదాకా అన్యమనస్కంగానే తనుమామూలుగా చేసే పనులు నిర్లక్ష్యంగా చేసి అమ్మగారిచేత చివాట్లు తిని, వీధి వరండాలో ఈజీ ఛైర్ క్రింద ఉన్న పేపరు చంకనపెట్టుకు చక్కాపోయాడింటికి.

* * * *

"మాకూ వస్తాదిలా వుంది గాలి. పేపరు చదువు" అని కొడుకుముందు పేపరుంచాడు అప్పలస్వామి. రాష్ట్రంలో కూడా ఫ్యాన్ల తగ్గింపు" అన్నదగ్గర వేలుంచి చూపిస్తూ.

* * * *

అప్పలస్వామి కొడుకు స్కూలుఫైనలు తప్పాడు. పోనీ తనలాంటి బంట్రోతు ఉద్యోగమైనా దొరుకుతుందేమో అని ఎంతగానో ఎన్నో విధాల ప్రయత్నించాడు. కానిదొరకలేదు. అతను విసిగి నిరాశపడిపోయిన రోజుల్లో. ఆ దేవుళ్ళపిడబ్ల్యూ అయి వచ్చాడు ఆ ఊరు.

ఆ ఊరుకి చిన్న రైల్వే స్టేషనుంది. "పిడబ్ల్యూగారితో సీక్రేటుగా మాట్లాడితే నాకు ఉద్యోగమవుతుందట. ఆయన

దేవుడిలాటి వాడట!" అని తన కొడుకు ఈరాస్వామి చెప్పే సరికి, ఎందుకన్నా మంచిదని 'సీక్రెట్' అంటే అర్థం తెలిసిన వాడు కాబట్టి కొంత అర్థం జేబులో వేసుకుని అతని దర్శనం చేసుకుని విషయం విన్నవించాడు అప్పలస్వామి.

వరాలిచ్చే దేవుళ్ళా "నీ కొడుకేం చదివాడు!" అని అడిగాడు పి. డబ్ల్యు. అప్పలస్వామి ఇచ్చిన ముడుపు ఉలెన్ పాంటు జేబులో కూరుకుంటూ. "స్కూలు ఫైనలు పోయిం దండి." అన్నాడు అప్పలస్వామి.

అయినా అతనివ్వబోయేదిలేబరు ఉద్యోగమేగా. "పంపించు రేపు ఉదయం" అన్నాడు హుందాగా పి. డబ్ల్యు.

ఈరాస్వామికి ఉద్యోగమయ్యింది. ప్రొద్దస్తమానం పి. డబ్ల్యు. గారింట్లోనేవుంటాడు. ఉద్యోగం పేరు పి. డబ్ల్యు. కాని అతను దేవేంద్రుడే. అతని పెళ్ళాం ఇంటి పనులు అస్సలు ముట్టుకోదు. నాకెందుకుకుటుంబనియంత్రణ అనుకున్నాడేమో! అతనికి ఎనమండుగురు పిల్లలు. అయినావారికే లోపమూలేదు. ఖరీదైన బ్రతుకు. అంటే సరిపోతుందేమో!

ఈరాస్వామి జీతంలో ప్రతినెలా ప్రావిడెంటు ఫండులా ఖచ్చితంగా పదిహేను రూపాయలు పి. డబ్ల్యుగారి చేతులో కట్టయిపోతూంటే పుసూరుమంటాడు. కాని పెదవులు కదపడు. ఎందుకంటే ఉద్యోగం పోతుందని భయం. గేంగులో బి. ఎ. లూ. బి. ఎస్. సి. లూ. చేరారు. తానేపాటివాడు!

ఐతే, పి. డబ్ల్యు. చతురుడనే చెప్పాలి. చదివినవాళ్ళు.

అతని పిల్లలకేకాక అక్కడ రైల్వేలో పనిచేసే వాళ్ళందరి పిల్లలకీ ట్యూషన్లు చెబుతారు. ఇంకా కొందరు ఆఫీసువర్కు చేస్తారు. అతనింట్లో వంట, చాకలి పనులు చేసేవారు కొందరు.

ఏమయితేనేం, అందరి దృష్టిలో అతను దేవుడై కూర్చున్నాడు.

*　　*　　*　　*

గణగణా చదివి "దీన్నిబట్టి ఆలోచిస్తే వచ్చేలానే ఉంది. ఓస్. పెద్ద పెద్ద ఆఫీసర్లే ఎగిరిపోతూంటే నీ ఉద్యోగమెంతది నాన్న!" అన్నాడు ఈరాస్వామి.

"నీ ఉద్యోగం పెరమెనెంటు కాదుగదురా! అందుకని ఎలా బతుకుతావా! అని" అప్పుడే ఉద్యోగం పోయినట్లు బెంగగా అన్నాడు అప్పలస్వామి.

"నీకు ఉద్యోగం తీసేస్తే నాకు ఇస్తారేమో!" అన్నాడు ఈరాస్వామి.

"ఉద్యోగాలు తగ్గించేటప్పుడు అలాటిది ఉండదు." అన్నాడు అప్పలస్వామి.

అతని కాపూట అన్నం సయించలేదు. తాను, తన తల్లి, భార్య. తలచెడి ఇల్లుచేరిన అక్క, నలుగురు రెక్కలు రాని పిల్లలు తనకి. బూమిా పుట్రా లేవు. ఎలా బ్రతకాలి! ఉద్యోగం పోతే! తానెంత కష్టపడ్డాడు ఉద్యోగం సంపాదించటానికి!

*　　*　　*　　*

రోడ్డు వేయించే కంట్రాక్టరు దగ్గర కూలీ అప్పలస్వామికి ఓ రోజు రాత్రి మా కేరియరు అప్పలస్వామి చేతికిస్తూ "బంగ్లాలో ఇంజనీరుగారున్నారు ఇచ్చేసి, అతనికేం కావాలో చూడు," అని ఓ ఏభై రూపాయలు అప్పలస్వామి చేతిలో పెట్టాడు కంట్రాక్టరు.

ఇంజనీరుగారు బసచేసిన బంగళాగదిలో బల్ల మీద కేరియరుంచి "తమరికేం కావాలన్నా సప్లయి చెయ్యమని కంట్రాక్టరుగారు నన్ను పంపించారండి." అన్నాడు అప్పలస్వామి వినయంగా.

అప్పలస్వామివైపు పరిశీలనగా పాదం మొదలు తల దాకా చూసి "నువ్వు కాంట్రాక్టరుగారి దగ్గర ఏ పన్లు చేస్తూంటావ్?" అడిగాడు ఇంజనీరు.

"పేరుకు కూలీనిగానండి. మేస్త్రీలాంటోణ్ణండి. తమకి బుడ్డీ...గిడ్డీ...ఇంకా..." అని నసిగి కొంచెం నవ్వి తలవంచాడు అప్పలస్వామి.

తనకి కావాల్సినవి ఆర్డరు వేశాడు ఇంజనీరు. నిమిషాల మీద సప్లయిచేశాడు అప్పలస్వామి.

ఇంజనీరుగారున్న రెండ్రోజుల్లో అతనికి తలలో నాలుకలా పనిచేసి మెప్పు పొందిన అప్పలస్వామి. "పెద్దోరు. నాను కూలోణ్ణి పేదోణ్ణి. పిల్లలోణ్ణి. దయతలసి బంట్రోతుద్యోగం నాటిది ఇప్పిస్తే మీ పేరు సెప్పుకుంటాను." అని చేతులు పిసుక్కుని దణ్ణం పెట్టాడు ఇంజనీరుకి.

హుందాగా తల పంకించి, ఠీవిగా నాలుగు అడుగులు ముందుకు వేసి, రెండు క్షణాలు ఏదో ఆలోచిస్తున్నట్టుమౌనం వహించి. "అప్లికేషను రాసియ్యి" అన్నాడు ఇంజనీరు.

ఉబ్బితబ్బిబ్బయిపోయిన అప్పలస్వామి అప్లికేషను రాయించి పట్టుకుని వచ్చి ఇచ్చి పది పది దండాలు పెట్టాడు.

ఆర్డరు పంపిస్తానని చెప్పి జీపెక్కి వెళ్ళి పోయాడు ఇంజనీరు.

ఆరుమాసాలు గడిచాయి. రోడ్లపని పూర్తయి తానూ కంట్రాక్టరు స్వగ్రామంచేరుకున్నారు. కాని, ఆర్డరూ లేదు ఆ ఇంజనీరూ పత్తాలేడు.

అయినా ఉద్యోగ ప్రయత్నంమానలేదుఅప్పలస్వామి. కూలి ఓ రోజు ఉండేది. ఓ రోజు ఉండేదికాదు. కాంట్రాక్టరు ఏదన్నా పని తీసుకొని తనను పనిలో వేసుకుంటే మళ్ళీ ఆ పని పూర్తి అయ్యేవరకూ తన ఇంట్లో పొయ్యిరాజేది. లేకపోతే పస్తులే. ఎందరివెనకో తిరిగి వేడుకున్నాడు, తన బాధలు చెప్పుకొని. మరెందరికో తనభార్య చెవికమ్మలూ ముక్కుకమ్మలూ అమ్మి లంచం పెట్టాడు. కాని ఉద్యోగందొరకలేదు.

చివరికి కంట్రాక్టరే జాలితలచి రికమెండేషను చేసి ఈ ఉద్యోగం వేయించాడు. అయితే ఓ ఒప్పందం. ఆ ఉద్యోగం తన కిచ్చిన ఆఫీసరుకని ప్రతి నెలా తన జీతంలో పదిరూపాయలు తీసుకునేవాడు కంట్రాక్టరు.

ఉద్యోగం విషయంలో అప్పటిదాకా వున్న అప్పల స్వామి అభిప్రాయం మారిపోయింది. ఇంజనీరుగారి బంట్రోతు అంటే తన ఆఫీసు గుమ్మంలో కూర్చుని ఆయన పిలిచిన వెంటనే వెళ్ళి కాయితాలు అటూ ఇటూ నడపడం, పోష్టుకి వెళ్ళటం, అతని వెనుక తానూ జీపులో ప్రయాణం చెయ్యటం, అతని తాలూకు సంచీ వగైరా పట్టుకోవటం అంతే.

కాని తాను ఇంటిదగ్గర అతని భార్య క్రింద బంట్రోతు పని చెయ్యాల్సివస్తుందనుకోలేదు.

"నీ పేరేమిటి?" అడిగిందామె మొదటి రోజు.

"అప్పలస్వామండి." అన్నాడు వినయంగా.

"నీ కులం?" మళ్ళీ ప్రశ్న.

"పద్మసాలీలమండి."

"వంట చెయ్యటం వచ్చా?"

"రాదండి."

"ఎలా ఐతే...పోనీ చెబుతాను. నేర్చుకుందువుగాని."

అప్పలస్వామి గుండెల్లో రాయిపడింది. తానెప్పుడూ ఇంటిదగ్గర వంట కాదు గదా కనీసం పొయ్యిలో కర్ర ఎగదోసిన పాపాన కూడా పోలేదు. కూర పాడయినా, అన్నం మెత్త

బడినా ఆడవాళ్ళమీద ఎగరటమే చాతవునుకాని అసలా వంటలెలా చెయ్యాలో తనకు తెలియదు.

అవాళ అన్నం వార్చబోయి గంజి కాళ్ళ మీద వంచుకున్నాడు.

"నువ్వెక్కడ దొరికావోయ్ మాకు" విసుక్కుంది ఇంజనీరు భార్య అన్నపూర్ణ.

"కాలెందుకు కాలింది?" అని తల్లి వేసినప్రశ్నకి జవాబు చెప్పకుండా వుండలేక పోయాడు అప్పలస్వామి.

"నీచేత అన్నం వార్పించిందా! గవర్నమెంటు నౌఖరీకి కుదిరావా! ఆయమ్మకాడ కుదిరావా! గట్టిగా అడగరా!" అని తల్లి నోరుచేస్తే, "ఒల్లకు. కడుపుకూటికోసం ఉద్యోగం సేస్తన్నం ఏదన్నా సెయ్యాల." అని సర్దుబాటు చేశాడు.

కాని అన్నపూర్ణ చీర తనచేత ఉతికించి "బాగులేదు. మరోసారి బాగా జాడించు" అనే సరికి గుండేల్లో నిప్పురవ్వ పడి రాజటం మొదలు పెట్టింది అప్పలస్వామికి.

"నీలమ్మ బట్టలుతికి ఉంటుంది. నీ బాబు, వాడి తండ్రి! అందరూ నానాటి ఓడి బట్టలు గుంజి బతికారు. తప్పదియ్యా, నువ్వు నాచేత నీ కట్టుడిపు గుడ్డలుతికిస్తున్నావ్" అని కసిగా చీర రాయికేసి బాదాడు అప్పలస్వామి.

చీర చిట్లగొట్టాడని తనపై భర్తతో ఫిర్యాదు చేసింది

అన్నపూర్ణ, అడిగాడు మెత్తగా మందలించాడు అప్పలస్వామిని ఇంటిపనులు జాగ్రత్తగా చేస్తుండని.

అప్పలస్వామిలాటి కొందరు నౌఖర్లు కూడ బలుక్కొని తమిలాటి పనులు ఎందుకు చెయ్యాలి? అని ప్రశ్నించుకొని యూనియన్‌ని సంప్రదించి ప్రభుత్వానికి ఫిర్యాదు చెయ్యాలని నిర్ణయించుకున్నారు. దానికి ఆజ్యం పోసినవాడు అప్పలస్వామి.

కాని కథ అడ్డం తిరిగింది. తాము చేసేపనుల్లో మార్పులేదుగాని ఆఫీసర్ల జీతాల్లో మార్ప్ప వచ్చింది.

ఓ రకంగా ఇంటిపనులకి అలవాటుపడి పోయాడు అప్పలస్వామి. అయినా ఒక్కోసారి 'నేనీ పనులు ఎందుకు చెయ్యాలి!' అని పెట్టిలో పెట్టె నొక్కిననాగులా బుసగొడ తాడు. పెదవులు దాటదా మాట.

*    *    *    *

దిగులుగా చూస్తున్న అప్పలస్వామిని "ఏట్రా అలా బెంగపడిపోతావు. పోతే పోతుంది ఎదవ ఉద్యోగం. బేంకోళ్లు అప్పులిస్తన్నారంట. గాడుగేదెని కొందాం. కనుక్కో ఎల్లి. మేపుకుందాం? మనకి జరక్కపోదు." అంది అతని అక్క లచ్చమ్మ. కనులు మూసుకున్నాడు అలసటగా. అక్క సలహా నచ్చింది అప్పలస్వామికి. నెల తిరిగేసరికి గాడుగేదులు గుమ్మంలో కామధేనువులా నిల్చుంది. తాను

బ్యాంకికి వెళ్ళి సంప్రదించి. తన హామీమీద బ్యాంకి వారు గేదెకోసం డబ్బిచ్చారు.

పెద్దపెద్ద కేన్‌లతో పాలు హోటళ్ళకి సప్లయి చేస్తున్నాడు అప్పలస్వామి. ఇది ఇంజనీరుగారి గేదె కాదు. తన గేదె. తృప్తిగా ఆత్మీయంగా దానికి సేవచేస్తున్నాడు. మేపుతున్నాడు.

రోజూ అన్నంలో గడ్డపెరుగు, చేతినిండా డబ్బులు. ఒకటి. రెండు క్రమంగా ఓ పెద్ద శాలనిండా తన గేదెలు.

ఇంటినిండా చిట్టూ, తవుడూ, తెలగపిండీ. వాకిటినిండా గడ్డికుప్పలూ.

వరుసగా మూతలు కట్టిన పాలబిందెలు. తన పాలబిందెల్లోని పాలు తీసుకుపోవటానికి రోడ్డుమీద నిల్చున్న లారీ.

గ్లాస్కో పంచా సిల్కు లాల్చీ, చేతివేళ్ళకి రాళ్ళ ఉంగరాలు. పక్క జేబునిండా నోట్ల కట్టలు, నిండుగా నిబ్బరంగా పాలు సరాఫరాచేస్తూనిల్చున్నాడు అప్పలస్వామి.

"ఏట్రా అలా కునికిపోతావు నెగు. ఇంజనీరుగారింటి నుంచి కబురొచ్చింది." లేపింది అప్పలస్వామిని అతని తల్లి

కమ్మని కల కరిగిపోయింది. కంగారుగా కనులు నులుపుకుంటూ లేచి కూర్చున్నాడు అప్పలస్వామి.

ఒంటి గంటకు భోజనానికి వచ్చిన అప్పలస్వామి పది నిమిషాలు నడుం వాల్చి విశ్రాంతి తీసుకువెళ్ళటం పరిపాటి.

కాని ఇవ్వాళ మంచంమీద వాలేసరికి అలసట వచ్చేసింది, నిద్రలోకి జారిపోయాడు. ఆలస్యమై పోయింది. అమ్మగారు ఎగిరిపడుతుంది అనుకూంటూ, చొక్కా తొడుక్కొని కొంచెం దూరం వచ్చినవాడల్లా మళ్ళీ వెనక్కి తిరిగి ఇంటికి వెళ్ళాడు పేపరు మర్చిపోయాననుకుంటూ.

"ఎంకింత ఆలస్యం చేశావ్" అని ఎగిరిపడే అమ్మగారి ఎదుట తల ఎత్తలేదు. పెదవి కదపలేదు అప్పలస్వామి.

*   *   *   *   *

"ఆ చెడిపోయిన సామాన్ల ఖరీదెంతో తెలుసా!" అడిగాడు ఇంజనీరు. తలవంచి చేతులు కట్టుకొని తన ఎదుట నిల్చున్న అప్పలస్వామిని.

"అవునండి, పొరపాటేనండి. ఎండ బెట్టిన సామాన్ల మీద మాదస్థ లేకపోవడం, మావోడు గోడకాయలుకడుతూ పి.డబ్ల్యు. గారింట్లో సెయ్యి కాల్చుకున్నాడని కబురొస్తే ఎలిపోయాను. డాక్టేరుగార్కి ఆణ్ని సూపించినాను. వచ్చేసరికి వాన రావడం సామాన్లు తడిసి కొట్టుకుపోవడం జరిగిపోయిడంది అన్నాడు అప్పలస్వామి.

"మరి ఆ నష్టం మాటేమంటావ్!" తాపీగా ఒక్కొ-

మాటా చెప్పిన అప్పలస్వామివైపు చిరాగ్గా చూస్తూ అడిగాడు ఇంజనీరు:

"నా జీతంలో డబ్బులు మినాయించుకోండి". అన్నాడు అప్పలస్వామి.

"డట్సాల్ రైట్. వెళ్ళు వెళ్ళి లోపల పని చూడు" అన్నాడు ఇంజనీరు.

'డట్సాల్ రైట్ అంటే నిజంగా ఆ గంధకం బీడూ వగైరా సామాన్ల ఖరీదు ఏబయి రూపాయలూ తన జీతంలో తీసుకుంటాడా!' బుర్ర గోక్కుంటూ ఇంట్లోకి నడిచాడు అప్పలస్వామి.

మళ్ళీ దీపావళీ సామాన్లు తయారుచేయటానికి ముడిసరుకులు బజారునుంచి వచ్చాయ్. పగలూ రాత్రీ తీరికలేదు వారింట్లో బంట్రోతులకి.

ఈరాస్వామి కుడిచెయ్యి వాచి కురు పయ్యింది కాలినచోట, అయినా ఒంటిచెయ్యి పనే చేస్తున్నాడు పి.డబ్ల్యు.గారింట్లో.

దీపావళీ పండుగకు అల్లుళ్ళూ, కూతుళ్ళూ రావటంతో వారిల్లు పెళ్ళిల్లులా తయారయ్యింది.

ఆ నెల ఈ స్వామి జీతంలో మామూలుకన్నా మరో రెండు రూపాయలు ఎక్కువ చందా క్రింద కట్టయిపోయాయి.

అప్పలస్వామి జీతంలో పాతిక రూపాయలు కట్టయి పోయాయి.

కారణం తెలుసుకున్న ఆడవాళ్ళు కారాలూ మిరియాలూ నూరారు. ఇది అన్యాయమని.

కాని న్యాయం జరిగేదెప్పుడు? మనసులు మారే దెప్పుడు?

కాల్చిపారేసియ్యేకదా బాబూ. మా పిల్లలు మతాబా లుకొనలేదని ఏడుత్తన్నారు. రెండివ్వండి'' అనికక్కుర్తిపడి అడిగాడు ఇంజనీరుగారి పిల్లల్ని అప్పలస్వామి.

"మేం కాల్చొద్దేమిటే! కావలిస్తే ఒచ్చిచూడమను" అన్నారు వాళ్ళు.

ఆ మాట విన్న అయ్యగారు నాలుగు మతాబాలు అప్పలస్వామి చేతిలో పెట్టాడు దానం చేస్తూన్నట్లు.

"పెతి పండక్కీ నానూ కొనీవోణ్ని బాబూ! ఈ సంవత్సరం కొనలేకపోన్ను వస్తాను బాబూ!" అని ఇంటి ముఖం పట్టాడు అప్పలస్వామి.

గుమ్మంలో పెట్టిన దీపం ప్రమిద దగ్గర కూర్చుని "చెస్. మన్లాటోళ్ళకి ఇలాటి పండుగలేటి! అయ్యగారింట్లో కన్నుల వైకుంటం!" అన్నాడు ఈరాస్వామి.

"పేదోళ్ళ కష్టంతో పెద్దోళ్ళ సోకురా బాబూ!" అని వేదాంతిలా నవ్వాడు అప్పలస్వామి.

—o—